
పొచ్చర జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి టిఫిన్ చేస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్


ఆసిఫాబాద్‌లో విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకుంటున్న జడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మి, కలెక్టర్ బోర్కడే హేమంత్


సోన్ : విద్యార్థులతో కలిసి అల్పాహారం తింటున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, నిర్మల్ కలెక్టర్ వరుణ్ రెడ్డి


మందమర్రి : విద్యార్థులతో కలసి అల్పాహారం చేస్తున్న విప్ సుమన్, మంచిర్యాల కలెక్టర్ సంతోష్


మంచిర్యాల అర్బన్: పాఠశాలలో అల్పాహారం తింటున్న విద్యార్థులు


భైంసా టౌన్ : విద్యార్థులతో కలిసి అల్పాహారాన్ని తీసుకుంటున్న ముథోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

# అల్పాహారం.. విద్యార్థులకు వరం..


ఆదిలాబాద్ రూరల్ మండలం పొచ్చర గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో అల్పాహారం తింటున్న విద్యార్థిని


మంచిర్యాల అర్బన్ : పాఠశాలలో అల్పాహారం తింటున్న విద్యార్థులు


విద్యార్థులకు అందజేసేందుకు సిద్ధంగా ఉన్న అల్పాహారం


కాగజ్‌నగర్ : అల్పాహారం తింటున్న జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు క్రిష్ణారావు

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అట్టహాసంగా సీఎం బ్రేక్‌ఫాస్ట్ ప్రారంభం

- సోన్‌లో మంత్రి అల్లోల, మందమర్రిలో విప్ సుమన్ శ్రీకారం
- ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్‌పర్సన్లు, కలెక్టర్లు
- విద్యార్థులతో కలిసి టిఫిన్ చేసిన ప్రజాప్రతినిధులు
- ఉమ్మడి జిల్లాలో 2,67,768 మందికి లబ్ధి
- ఆనందంలో సర్కారు స్కూళ్ల విద్యార్థులు, తల్లిదండ్రులు

మంచిర్యాల ప్రతినిధి/కుమ్రం భీం ఆసిఫాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : సర్కారు బడుల్లో సకల సౌకర్యాలు కల్పించి మెరుగైన విద్యనందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. తాజాగా సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించింది. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించగా, అనూహ్య స్పందన వచ్చింది. విద్యార్థులకు అల్పాహారం వడ్డించడంతో పాటు వారితో కలిసి ఆరగించారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో ప్రభుత్వ విప్ బాల్క సుమన్, కలెక్టర్ బదావత్ సంతోష్, బెల్లంపల్లిలో అదనపు కలెక్టర్ రాహుల్, మంచిర్యాలలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మోతీలాల్ ప్రారంభించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంలోని జడ్పీఎస్ఎస్ గర్ల్స్‌లో కలెక్టర్ హేమంత్ బోర్కడే, జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కాగజ్‌నగర్ జడ్పీఎస్ఎస్‌లో జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, నిర్మల్ జిల్లా సోన్‌లో రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, కలెక్టర్ వరుణ్ రెడ్డి, ముథోల్‌లో ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, ఆదిలాబాద్‌లో కలెక్టర్ రాహుల్ రాజ్, బోథ్‌లో అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తాలు ప్రారంభించారు.

### ఉమ్మడి జిల్లాలో 2,67,768 మందికి లబ్ధి..

ఈ పథకం అమల్లోకి వస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 3,637 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 2,56,204 లక్షల మంది విద్యార్థులకు మేలు జరగనుంది. 18 ఎయిడెడ్, 14 మోడల్ స్కూల్స్‌లో 11,472 మందితో పాటు ఆసిఫాబాద్ జిల్లాలోని 5 మదర్సాల్లోని 92 మంది విద్యార్థులకు సైతం బ్రేక్‌ఫాస్ట్ అందనుంది. ఆదిలాబాద్ జిల్లాలో అన్ని పాఠశాలల్లో కలుపుకొని 1,26,977 మంది, నిర్మల్ జిల్లాలో 51,543 మంది, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 44,062 మంది విద్యార్థులు, మంచిర్యాల జిల్లాలో 45,186 మంది విద్యార్థులకు ప్రతి రోజూ ఉదయం అల్పాహారం అందించనున్నట్లు విద్యాశాఖ అధికారులు వివరించారు.

### ఉదయం అల్పాహారం.. మధ్యాహ్నం భోజనం

తెలంగాణ ప్రభుత్వం విద్యార్థుల కడుపు నింపి వారి మేధస్సు చురుకుగా పని చేసేందుకు చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగానే ఇప్పటికే ప్రతిరోజు మధ్యాహ్నం సన్నబియ్యంతో కూడిన నాణ్యమైన భోజనం అందిస్తుంది. దానికి తోడు రాగిజావ, కోడిగుడ్డు, అరటిపండ్లను అందజేస్తోంది. కొత్తగా ప్రవేశపెట్టిన సీఎం కేసీఆర్ బ్రేక్‌ఫాస్ట్‌తో మరింత పౌష్టికాహారం అందనుంది. విద్యార్థులకు నాణ్యమైన, పుష్టికరమైన భోజనం అందనుండగా, వారి శారీరక, మానసిక ఎదుగుదల సక్రమంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే బడి పిల్లల హాజరును మెరుగుపర్చడంతో పాటు డ్రాపౌట్స్‌ను తగ్గించేందుకు ఈ పథకం దోహదపడనున్నడి. విద్యార్థులు పాఠశాలకు ఆకలితో వచ్చి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించగా, ఈ పథకంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### టిఫిన్ పెట్టుడు స్టార్ట్ చేసిన్రు


మా బడిలో ప్రైవేటుకు మించి సౌకర్యాలున్నాయి. పుస్తకాలు, స్కూల్ డ్రెస్సులు అన్నీ ఉచితంగా ఇస్తున్నారు. మధ్యాహ్నం కడుపునిండా భోజనం కూడా పెడుతున్నరు. కొత్తగా టిఫిన్ కూడా స్టార్ట్ చేసిన్రు. ఇక రోజూ పెడుతరట. ఆకలితో ఉంటే చదువు మనసున పట్టదు. ఇక రోజూ పొద్దుగాల బడికి వచ్చి.. టిఫిన్ చేస్త. మంచిగ చదువుకుంటం.

-చెల్పూరి కీర్తన, మందమర్రి

### బ్రేక్‌ఫాస్ట్ మంచిగుంది


మా స్కూల్‌లో కొత్తగా బ్రేక్ ఫాస్ట్ స్టార్ చేశారు. ప్రతిరోజూ ఇంట్లో ఉదయం టిఫిన్ చేయడం కుదరదు. తొందరగా రెడీ అయ్యి బడికి పోతం. కాబట్టి మధ్యాహ్నం వరకు ఆకలితో ఉండాల్సి వస్తది. ఇక నుంచి మాకు ప్రతి రోజూ మా స్కూల్‌లో టిఫిన్ పెడుతరట. ఈ రోజు తిన్న. మంచిగుంది. మా బాధను అర్థం చేసుకున్న సీఎం కేసీఆర్ సార్‌కు థాంక్స్. - కస్తూరి అశ్విన్, మందమర్రి

### పనికి తొందరగా వెళ్లొచ్చు..


భైంసాటౌన్, అక్టోబర్ 6: నా బిడ్డ శ్రద్ధ దేగాం సర్కారు బడిలో ఆరో తరగతి చదువుతున్నది. ఉదయం ఇంట్ల టిఫిన్ చేసుడంటే కొంత కష్టమే. మేం పొద్దుగాల్నే పొలం పనికి పోవుడు ఉంటది. తను కూడా పొద్దున్నే స్కూల్‌కు పోతది. ఆకలికి ఇబ్బంది పడుతదని పెద్ద రంది అయితుండే. ఇప్పుడు స్కూళ్లనే టిఫిన్ పెడుతమని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకునుడు మంచిగున్నది. మధ్యాహ్నభోజనం కూడా పెడుతున్నరు. స్కూల్ పుస్తకాలు, డ్రెస్సులు, భోజనం అంతా ఇప్పటిదాకా ప్రభుత్వమే చూసుకుంటున్నది. ఇప్పుడు టిఫిన్ కూడా పెడుతున్నది. కేసీఆర్ సారు ఉన్నడు కాబట్టే ఇంత మంచి నిర్ణయం వచ్చింది.

-మారుతి, దేగాం

### మంచిగ చదువుకోవచ్చు..


భైంసాటౌన్, అక్టోబర్ 6: మా పాఠశాలలో శుక్రవారం సంది టిఫిన్ పెట్టుడు షురూ జేసిన్రు. కమ్మని టిఫిన్ పెట్టిన్రు. ఇంట్లో తిన్నట్లే ఉంది. మా ఎమ్మెల్యే సారు వచ్చి అందరికీ టిఫిన్ వడ్డించిండ్రు. ఈ రోజు మాకు ఉప్మా పెట్టిన్రు. ఇక నుంచి రోజూ బడికి రావొచ్చు. ఆకలికి ఇబ్బంది ఉండదు. ఇప్పటికే మాకు రాగిజావ, మధ్యాహ్న భోజనం పెడుతున్నరు. పుస్తకాలు, యూనిఫామ్ ఉచితంగా ఇస్తున్నరు. ఇప్పుడు మంచిగ టిఫిన్ కూడా మొదలుపెట్టిన్రు. అందుకే నాకు సీఎం కేసీఆర్ అంటే ఇష్టం. -నందిని, 8వ తరగతి, దేగాం

### కేసీఆర్ సారుకు థ్యాంక్స్..


నేను ఉదయం ఇంటి నుంచి తినకుండానే వచ్చేదాన్ని. ఒక్కోసారి మస్తు ఆకలయ్యేది. ఇప్పుడు సీఎం అల్పాహారంతో బడిలనే టిఫిన్ చేయొచ్చు. ఇంట్లో అంత పొద్దున్నే టిఫిన్ చేయాలన్నా ఇబ్బందే. ముఖ్యమంత్రి అల్పాహారం పథకంతో ఇప్పుడు ఇబ్బంది లేదు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు థ్యాంక్స్.

- సలోని, తొమ్మిదో తరగతి


ఆదిలాబాద్ రూరల్ మండలం పొచ్చరలోని జడ్పీ పాఠశాలలో టిఫిన్ చేస్తున్న విద్యార్థినులు


బోథ్ : విద్యార్థులతో మాట్లాడుతున్న ఆదిలాబాద్ అడిషనల్ కలెక్టర్ ఖుష్బూ గుప్తా


బెల్లంపల్లి: విద్యార్థులతో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేస్తున్న మంచిర్యాల అదనపు కలెక్టర్ రాహుల్

### ప్రతి రోజూ స్కూలుకు వస్తా


మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 6 : మార్నింగ్ ఇంట్లో అన్నం వండకున్నా, టిఫిన్ లేకున్నా స్కూలుకు డుమ్మా కొట్టేది. సార్లు సెప్పిన్రు ఇక నుంచి రోజుకో టిఫిన్ ఉంటదట. ఇగ ప్రతి రోజూ స్కూలుకు వస్త. ఇంటికాడకన్నా స్కూలుకు వస్తే అటు చదువు, ఇటు మధ్యాహ్నం లంచ్‌తో పాటు పొద్దున టిఫిన్ కూడా చేయవచ్చు. మన ముఖ్యమంత్రి కేసీఆర్ సార్‌కు థాంక్యూ..

- పీ. గీతిక్, నాలుగవ తరగతి, గర్మిళ్ల స్కూల్, మంచిర్యాల


మంచిర్యాల అర్బన్ : అల్పాహారం వడ్డిస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

### బెంగ లేదిక...


సోన్, అక్టోబర్ 6: ప్రతిరోజూ ఉద యం పూట పిల్లలకు టిఫిన్ అందించడం మంచి ఆలోచన. పిల్లలు స్కూల్‌కు రెడీ అవడం లేటవుతుందని ఇంట్లో ఒక్కో సారి ఏం తినకుండా వస్తున్నరు. గిట్లయితే వాళ్ల ఆకలి గురించి మాకు పెద్ద రంది ఉంటుండే. ఇప్పుడిక మాకు ఆ బెంగ లేకుండా పోయింది. పిల్లలకు ఉచిత చదువుతో పాటు బట్టలు, పుస్తకాలు అన్ని సర్కారే ఇస్తున్నది. మధ్యాహ్నం భోజనం కూడా ఇక్కడే పెడుతున్నరు. ఇప్పుడు పొద్దున పూట టిఫిన్ కూడా ఏర్పాటు చేయ డం ఎంతో సంతోషంగా ఉంది. పేదింటి బిడ్డలు ఆకలి తో ఇబ్బంది పడొద్దని సర్కారు ఇంత మంచి నిర్ణయం తీసుకోవడం బాగుంది. -అక్రం లక్ష్మి, విద్యార్థి తల్లి, సోన్

### టిఫిన్ బాగుంది..


మాకు పొద్దున్నే బళ్లో ఉప్మా, చట్నీతో టిఫిన్ పెట్టిండ్రు. రోజూ ఇంటికాడ అన్నం తిని వచ్చేదాన్ని. పొద్దున్నే అమ్మ మాకోసం వంట చేసి, తినిపించి బడికి పంపేది. ఇప్పుడు బడిలోనే టిఫిన్ పెట్టడం మా అదృష్టం. ఇక ఒక్కో రోజు అన్నం కాకపోయినా బడిలో తింటారని నమ్మకం ఇంట్లో వాళ్లకు ఉంటది. ఇయ్యాల మంచిగ మంత్రి, కలెక్టర్ సార్లతో కలిసి టిఫిన్ తిన్న. టిఫిన్ ఎంతో రుచిగా ఉంది. రోజూ పొద్దున్నే వచ్చి టిఫిన్ చేసి మంచిగ చదువుకుంట.

-పల్లికొండ శ్రీనిధి, విద్యార్థిని, ఐదో తరగతి